మహానేతకు నివాళి

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



భౌరంపేట్‌లో నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి



నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న అభిమానులు



జగద్గిరిగుట్టలో వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ తదితరులు

మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని వక్తలు ఆయన సేవలను కొనియాడారు.

– కుత్బుల్లాపూర్



షాపూర్‌నగర్ చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత సురేష్‌రెడ్డి



ప్రగతినగర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న అభిమానులు



సూరారం రాజీవ్‌గృహకల్పలో..



కొంపల్లి మున్సిపాలిటీ ఎన్‌సీఎల్ నార్త్‌లో మైనార్టీ నాయకుడు ఆకుల హుస్సేన్‌బాబు ఆధ్వర్యంలో..



నిజాంపేట్‌లో నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

ప్రజావాణిలో 21 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కుత్బుల్లాపూర్లో 10 ఫిర్యాదులు వచ్చాయి. అందులో టౌన్ ప్లానింగ్ ఒకటి, ఇంజినీరింగ్ 5, ఎలక్ట్రికల్ 2, ట్యాక్స్ సెక్షన్ ఒకటి వచ్చాయి. అదే విధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో 11 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో టౌన్ ప్లానింగ్ 2, ఇంజినీరింగ్ 7, ఎలక్ట్రికల్ 1, ఎంటమాలజీ 1 వచ్చాయి. గతంలో ఇచ్చిన ఫిర్యాదులు సైతం పరిష్కారం కాలేదని పలువురు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రేటర్ అధికారులు మాత్రం వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ కింది స్థాయి సిబ్బంది మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

చురుగ్గా బతుకమ్మ కుంట పనులు



బతుకమ్మకుంట పనులను పరిశీలిస్తున్న గాజులరామారం డీఈ రూపాదేవి, ఏఈ తిరుపతి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్ బతుకమ్మ కుంట పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎప్రిల్‌లో 20 లక్షలతో ప్రారంభమైన ఈ పనులను సోమవారం గాజులరామారం డీఈ రూపాదేవి, ఏఈ తిరుపతి సందర్శించారు. సుమారు 40శాతం వరకు పూర్తి అయ్యాయని అన్నారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

చెస్ పోటీల్లో సత్తాచాటిన అఖిల్



అఖిల్‌కు ట్రోఫీ అందజేస్తున్న ఆర్గనైసింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు

జగద్గిరిగుట్ట: ప్రగతినగర్‌లోని పుచలపల్లి సుందరయ్య భవన్‌లో ప్రగతి చెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్ జరిగింది. అండర్ 9, 11, 13, 19 విభాగాలలో 5 రౌండ్ల చొప్పున జరిగిన ఈ పోటీలలో జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన అఖిల్ సత్తాచాటారు. అండర్-19 విభాగంలో తృతీయ బహుమతి గెలుచుకున్న అఖిల్‌ను కోచ్ అభినందించారు.

ముందుకు జరిగి శ్లాబ్ నిర్మాణం

డీసీకి మైసమ్మనగర్ బీ-బ్లాక్ వాసి ఫిర్యాదు



డీసీకి ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాసులు

జగద్గిరిగుట్ట: భవప నిర్మాణ శ్లాబ్ తమ ఇంటికి ప్రమాదం పొంచి ఉన్నట్లు మైసమ్మనగర్ బీ-బ్లాక్‌కు చెందిన శ్రీనివాసులు గాజుల రామారం డీసీ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. 42 - 381 ఇంటి నిర్మాణం చేపడుతూ, కాలనీ పెద్దలు చెప్పిన వినకుండా మొదటి అంతస్తు శ్లాబ్ ముందుకు జరిగి నిర్మిస్తున్నారని తెలిపారు. మున్ముందు ఈ శ్లాబ్ నిర్మాణం వల్ల తమకు ఇబ్బందులు కలగవచ్చన్నారు. ఈ విషయమై అధికారులు వచ్చి పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'నిసార్ సాహిత్యం మనకు దిక్సూచిలా ఉంటుంది'



నిసార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్

జగద్గిరిగుట్ట: ప్రజా కళలను ముందు తరాలకు అందించటమే నిసార్‌కు నిజమైన నివాళి అని ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. జగద్గిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ప్రజా వాగ్గేయకారుడు నిసార్ 4వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిసార్ నేడు మన మధ్యలో లేకపోయినా వారి సాహిత్యం ఎల్లవేళలా మనకు దిక్సూచిలా ఉంటుందన్నారు. వారి ఆశయాలను ముందు తరాలకు అందించటమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శాంతి సంఘం నాయకులు కిషన్‌రావు,అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు బైరాగి మోహన్, రాష్ట్ర సీపీఐ నాయకులు ఏసురత్నాం, మండల కార్యదర్శి ఉమామహేష్, తెలంగాణ ఉద్యమ కళాకారుడు మాపల్లె శంకర్, స్థానిక నాయకులు రషీద్‌లు పాల్గొన్నారు.

ఆలయ హుండీ డబ్బులు ఎత్తుకెళ్లిన ఇద్దరి అరెస్టు

జీడిమెట్ల: షాపూర్‌నగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు దొంగలను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్ వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున షాపూర్‌నగర్‌లోని నల్లపోచమ్మ గుడి తాళాలు పగులగొట్టి ఇద్దరు దొంగలు ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులో నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇది గమనించిన ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగతనానికి పాల్పడింది న్యూఎస్‌ఎల్‌బీ నగర్‌కు చెందిన కె.సంజయ్ (25), ఉమేష్(23)లుగా గుర్తించారు. సోమవారం ఉదయం ఇద్దరిని అదుపులోకి తీసుకుని మేడ్చల్ కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోండి..

ప్రతి ఒక్కరూ తమ వ్యాపార సముదాయాలు, ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌స్పెపెక్టర్ జి.మల్లేష్ సూచించారు. సీసీ కెమరాలు ఉంటే నేరస్తులను సులభంగా గుర్తించవచ్చన్నారు.

చర్మ ఆరోగ్యానికి ఆహారంలో మార్పుచేర్పులు

సాక్షి, సిటీబ్యూరో: చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు ఆహారంలో మార్పు చేర్పులు అవసరమని ప్రముఖ కాస్మొటాలజిస్ట్ గీతికా మిట్టల్ గుప్తా అన్నారు. ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తగినంత నిద్ర, చురుగ్గా ఉండటంతో పాటు సమతుల ఆహారంలో భాగంగా విటమిన్ ఇ, జింక్ తదితర పోషకాలు అందించే ఆల్మండ్స్(బాదం పప్పులు) వంటివి రోజువారీ ఆహారంలో చేర్చాలని సూచించారు. ఆహారంలో మార్పు చేర్పులు చేయకుండా పైపూతతో చర్మ సంరక్షణ అసాధ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో న్యూట్రిషనిస్ట్ డా.రోహిణి పాటిల్ తదితర వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కుత్బుల్లాపూర్: ఎలుకల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన మాలోతు బుక్యా(59) ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం ఉదయం 6గంటలకు డ్యూటీకి వెళ్లిన బుక్యా మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన భార్యకు ఫోన్ చేసి ఎలుకలు మందు తాగినట్లు పేర్కొన్నాడు. దీంతో వెంటనే అతన్ని కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాంగ్ రూట్ వద్దు.. ఇబ్బంది కల్గించొద్దు



పట్టుబడ్డ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: రాంగ్ రూట్‌లో వచ్చి ఇతర వాహనదారులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో చెక్ పెడుతూ పలు ప్రాంతాల్లో అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సోమవారం రాత్రి అల్వాల్ నుంచి సుచిత్రకు వచ్చే రోడ్డులో.. అదేవిధంగా కుత్బుల్లాపూర్ నుంచి వచ్చే ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. సుమారు 15 మంది రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనదారులను అడ్డుకున్నారు. వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. గతంలో మాదిరిగా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ఊరుకోమన్నారు. పోలీసు కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఎఫ్‌టీఎల్ స్థలం కబ్జాపై అధికారుల ఆరా



పరికి చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జాపై ఆరా తీస్తున్న అధికారులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవిహిల్స్‌ను ఆనుకుని ఉన్న పరికి చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ అజేష్, టౌన్‌ప్లానింగ్ అధికారి సంగీత పరిశీలించారు. పరికి చెరువు స్థలంలో ఓ వ్యక్తి ప్లాట్లు చేసి విక్రయాలు చేపట్టడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ పరికి చెరువును సందర్శించిన విషయం తెలిసిందే. ఆయన జిల్లా అధికారులకు చెరువు కబ్జాపై ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా అధికారులు ఎంత మేరకు చెరువు ఎఫ్‌టీఎల్, శ్మశానవాటిక స్థలాలు కబ్జాకు గురైందన్న విషయాన్ని పరిశీలించారు.

సర్వే నం.155లోని ప్రభుత్వ స్థలంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నం.155లోని ప్రభుత్వ స్థలంలో గాజులరామారం డీసీ మల్లారెడ్డి ఆదేశాలతో సోమవారం ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టారు. 'సాక్షి'వరుస కథనాలతో స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం అక్కడి చూడగా ఫెన్సింగ్ నిర్మాణం జరుగుతున్న తీరును చూసి అవాక్కయ్యారు. 3,553 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేయాలి కానీ డీసీ కేవలం 2453 గజాల స్థలానికి మాత్రమే ఫెన్సింగ్ వేయించడంతో అధికారులు ప్రశ్నించారు. వెంటనే డీసీ మల్లారెడ్డి ఆ పనులను నిలిపి వేయించారు. ప్రభుత్వ స్థలానికి సంబంధించిన గత సర్వే పూర్తి వివరాలను ఇవ్వాలని అధికారుల ఆదేశించినట్లు స్థానికులు తెలిపారు.

హాస్టళ్లు, కేఫ్స్‌లో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు

కుత్బుల్లాపూర్: మైసమ్మగూడలోని పలు హాస్టళ్లు, కేఫ్స్, స్మోకింగ్ జోన్లలో సోమవారం పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్ జాగిలం సహకారంతో హాస్టల్ గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇటీవల పలు హాస్టళ్లల్లో విద్యార్థులు డ్రగ్స్ వాడుతున్నారన్న సమాచారం అందడంతో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.



మైసమ్మగూడలోని ఓ హాస్టల్లో తనిఖీలు చేపడుతున్న ఏసీపీ రాములు

వజ్రం కంటే విలువైనది పుస్తకం

• కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ • షిర్డీహిల్స్‌లో గ్రంథాలయం ప్రారంభం

జగద్గిరిగుట్ట: వజ్రం కంటే విలువైనది పుస్తకం అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట షిర్డీహిల్స్‌లో దాసు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డా. బీఆర్ అంబేద్కర్ - బాబు జగ్జీవన్‌రామ్ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వజ్రం కంటే విలువైనది పుస్తకం అని, దైనందిక జీవితంలో మానసిక ప్రశాంతతను పొందేందుకు మంచి పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఎత్తరి మారయ్య, యేసురత్నం, ఇందిరాగౌడ్, విఠల్, బ్రహ్మనంద చారి, భద్రప్ప, జైహింద్ రాంబాబు, అనిల్, ఎస్ రాజు, కరుణాకర్, నాగేష్, ఎస్.మహేందర్, స్వామి దాసు, ప్రభాకర్, నరేందర్, శ్రీ సాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ షిరిడి హిల్స్ అధ్యక్షులు సిహెచ్.దాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి ఎం.శేషు, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.



డా.బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

◆ లింకు రోడ్లతో ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చు...

డివిజన్ పరిధి భూదేవిహిల్స్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు భూదేవిహిల్స్ రోడ్డు పనులు, మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ పనులు, విద్యుత్ లైన్ మరమ్మతు పనులను చేపట్టాలని ఎమ్మెల్యే గారిని కోరగా సానుకూలంగా స్పందించారు. త్వరలోనే భూదేవి హిల్స్ మీదుగా నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి కూకట్ పల్లికి వెళ్లే రహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి అధికారులు వెంటనే వ్యయ ప్రణాళికలు రూపొందించి వీలైనంత త్వరగా పనులను చేపట్టి ప్రజలకు వినియోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సతీష్, కృష్ణ, సోమయ్య, కేవీ రాజు, అయోధ్య, తారా సింగ్, దాసు, మల్లాచారి, త్రివేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళా సాధికారతతోనే కుటుంబ స్థితిగతులు మారుతాయి

గాజులరామారం పట్టణ మహిళా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ సెంటర్‌ను సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. మహిళలంతా ఐకమత్యంగా ఉండి ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అందరికీ తెలియజేస్తూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సాధికారతతోనే కుటుంబ స్థితిగతులు మారుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, ఎర్ర శంకరయ్య, దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు భాస్కర్, మద్దెల సత్యనారాయణ, ప్రశాంత్, మహిళా సంఘం నాయకురాలు దేవ కరుణ, సంధ్య, షబానా, భ్రమరాంబ, అరుణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



భూదేవిహిల్స్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

కుత్బుల్లాపూర్: తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు ముదిరెడ్డి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో మెమోరాండమ్ సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరికి 250 గజాల ఇళ్ల స్థలాలు, పింఛన్, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం హయంలో ఉద్యమకారులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక సభ్యులు మాధవరెడ్డి, జానయ్య, రామ్‌రెడ్డి, ఎండీ గౌస్, రామస్వామి, మాణిక్యం, నాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, సాయిరెడ్డి, వసంత తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో మెమోరాండమ్ సమర్పించేందుకు వచ్చిన ఉద్యమకారుల వేదిక సభ్యులు